ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet
Edition
శనివారం 29 నవంబరు
www.prajaswaramdaily.com
3 pm

దీక్షా దివస్ పేరుతో నాటకాలు

ప్రజలు బీఆర్ఎస్‌ను విశ్వసించరు: మంత్రి సీతక్క

(హైదరాబాద్, ప్రజాస్వరం) బీఆర్ ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఒక్కరోజే దీక్షా దివస్ చేసేవాళ్లని.. అధికారం పోయిన తర్వాత ఇప్పుడు పది రోజుల పాటు దీక్షా దివస్ పేరుతో నాటకాలు ఆడుతున్నారని మంత్రి సీతక్క విమర్శించారు. ప్రజలకు పదేళ్లలో చేసిన అభివృద్ధి ఏంటో ఈ దీక్షా దివస్‌లో చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎంతో చేసిందన్నారు. ఈ విజయాలను ప్రజలకు వివరించేందుకు తాము 10 రోజులపాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. వీటిని అడ్డుకునే కుట్రలోనే దీక్షా దివస్ పేరుతో బీఆర్ ఎస్ నాటకాలు ఆడుతోందని మండిపడ్డారు. "తెలంగాణ వచ్చాక వందల రెట్లు లబ్ది పొందింది కేసీఆర్ కుటుంబమేనని అన్నారు. ఆ పార్టీ దగ్గర అధికారం మాత్రమే లేదని, . కోట్లాది రూపాయలు ఉన్నాయన్నారు. అధికారం ఉంటేనే ప్రజల్లో ఉంటాం లేకపోతే బయటకే రావొద్దని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారన్నారు. దీక్షా దివస్ పేరుతో బీఆర్ ఎస్ చేస్తున్న డ్రామాలను తెలంగాణ ప్రజలు విశ్వసించరు అని మంత్రి అన్నారు. కొవిడ్‌ను ఆరోగ్యశ్రీలో చేర్చాలంటూ 2021లో ఇందిరా పార్క్ వద్ద సీతక్క దీక్ష చేపట్టారు. అప్పటి ప్రభుత్వం కేసు నమోదు చేసింది. కేసు విచారణలో భాగంగా నాంపల్లిలోని ప్రజా ప్రతినిధుల కోర్టుకు సీతక్క హాజరయ్యారు.

జనవరి 9న డబ్ల్యూపీఎల్ ప్రారంభం

- తొలిమ్యాచ్ ముంబయి వర్సెస్ రాయల్ ఛాలెంజర్స్
- ఫిబ్రవరి 5న ఫైనల్ వడోదర వేదిక
- పాల్గొన్ననున్న ఐదు జట్లు

హైదరాబాద్, ప్రజాస్వరం : డబ్ల్యూపీఎల్ సూపర్‌లీగ్‌కు సంబంధించి తాజాగా పూర్తి షెడ్యూల్ విడులైంది. డబ్ల్యూపీఎల్ 2026 సీజన్ జనవరి 9న ముంబయి ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య నవీముంబయి వేదికగా తొలి మ్యాచ్‌తో ప్రారంభం కానుంది. ఫైనల్ మ్యాచ్ వడోదర వేదికగా ఫిబ్రవరి 5న జరగనుంది. డబ్ల్యూపీఎల్ మ్యాచ్‌లన్నీ ఈ రెండు వేదికల్లోనే నిర్వహించనున్నారు. ఈ లీగ్‌లో ముంబయి ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, దిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ జెయింట్స్, యూపీ వారియర్స్.. మొత్తం అయిదు జట్లు పోటీ పడుతున్న విషయం తెలిసిందే. ఆక్షన్ ఇటీవలే ముగిసిన విషయం తెలిసిందే. ఇందులో భారత ఆల్‌రౌండర్ దీప్తి శర్మ అత్యధిక ధర పలికారు. ఆమెను 3.20 కోట్లతో యూపీ వారియర్స్ ఆర్‌టీఎం కార్డు ఉపయోగించి తీసుకుంది. న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ అమేలియా కెర్‌ను రూ.3 కోట్లకు ముంబయి ఇండియన్స్, భారత ఆల్‌రౌండర్ శిఖా పాండేను రూ.2.40 కోట్లకు యూపీ వారియర్స్, కివీస్ సీనియర్ ప్లేయర్ సోఫీ ఎకిల్‌స్టోన్‌ను రూ.2 కోట్లకు గుజరాత్ జెయింట్స్ తీసుకున్నాయి.

శ్రీలంకలో దిత్వా తుఫాన్ బీభత్సం

123 మంది మృతి.. 130 మంది గల్లంతు

మృతుల కుటుంబాలకు ప్రధాని మోదీ సంతాపం

భారత్ వైపు దూసుకొస్తున్న తుఫాన్

కొలంబో, ప్రజాస్వరం : శ్రీలంకపై దిత్వా తుఫాన్ తో ఇప్పటి వరకు 123 మంది ప్రాణాలు కోల్పోయారు. 130 మంది వరకు గల్లంతయ్యారు. ఇక రంగంలోకి దిగిన అధికారులు సహాయ చర్యలు చేపట్టారు. 43,995 మందిని పునరావాస కేంద్రాలకు తరలించినట్లు విపత్తు నిర్వహణ కేంద్రం శనివారం తెలిపింది. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని డైరెక్టర్ జనరల్ సంపత్ కొటువేగోడ తెలిపారు. సాయుధ దళాల సహాయంతో సహాయ చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు.

ప్రస్తుతం తుఫాన్ భారతదేశం దిశగా సాగుతోంది. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో బీభీత్సం సృష్టించే అవకాశాలు ఉన్నాయి. దీంతో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తం అయ్యాయి. ఇక శ్రీలంకలో జరిగిన ప్రాణ నష్టంపై ప్రధాని మోడీ సంతాపం వ్యక్తం చేశారు. అంతేకాకుండా మానవతా దృక్పథంతో శ్రీలంకకు ప్రత్యేక విమానాల్లో సాయాన్ని కూడా పంపించారు.

తరలిరండి.. ఉజ్వల తెలంగాణలో

పాలుపంచుకోండి

డిసెంబర్ లో 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీ సదస్సు

ప్రముఖులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆహ్వానాలు

13న ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లయనెల్ మెస్సీ రాక

హైదరాబాద్, ప్రజాస్వరం
"తరలిరండి ఉజ్వల తెలంగాణలో పాలుపంచుకోండి.." అన్న నినాదంతో ప్రజా ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రపంచంలో పేరొందిన ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు, టెక్నాలజీ రంగ నిపుణులు హాజరుకానున్నారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఈ సదస్సు నిర్వహణకు భారీ ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. హైదరాబాద్ చరిత్రలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహించాలని నిర్ణయించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రముఖులకు ఆహ్వానాలు పంపించారు. ఇందుకు దేశ విదేశాలకు చెందిన దాదాపు 3 వేల మంది ప్రముఖులకు ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. బిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లేయర్.. ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ డైరెక్టర్ ఎరిక్ స్విడర్ , పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాయల్ ఫ్యామిలీ సభ్యులు, వివిధ కంపెనీల అంతర్జాతీయ స్థాయి సీఈఓలు సదస్సుకు హాజరవుతున్నట్టు ఇప్పటికే సమాచారం పంపించారు.
యూఏఈ రాజవంశానికి చెందిన, ఎమిరేట్స్ గ్లోబల్ ఇన్వెస్ట్ మెంట్స్ డైరెక్టర్ షేఖ్ తారిక్ బిన్ ఫైజల్ అల్ ఖసిమి, రస్ అల్ ఖైమా ప్రతినిధులు, డుయిష్ బోర్సే గ్రూప్ హెడ్ లుడ్విగ్ హింజెల్మన్ , ఎన్రిషన్ వ్యవస్థాపక భాగస్వామి విన్టన్ , మాండయ్ వైల్డ్ లైఫ్ గ్రూప్ గ్రూప్ సీఈఓ బెన్నెట్ నియో తో పాటు పలు టెక్ కంపెనీల సీఈవోలు, పెట్టుబడిదారులు, స్టార్టప్ వ్యవస్థాపకులు ఈ సదస్సులో పాల్గొనడానికి ఇప్పటికే సంసిద్ధతను తెలియజేశారు.
'2047 నాటికి వికసిత్ భారత్ - జాతీయ వృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్ 2047' దార్శనిక పత్రం తయారు చేసింది. ఆర్థిక వృద్ధి, అన్ని రంగాల ప్రగతి, సంక్షేమం, సాధికారత, సమ్మిళిత వృద్ధి లక్ష్యంగా భవిష్యత్తు తెలంగాణకు రోడ్‌మ్యాప్‌ను రూపొందించింది. ఈ లక్ష్యాలను.. ప్రభుత్వం సంకల్పాన్ని ప్రపంచ వేదికపై ప్రదర్శించేందుకు డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 ను నిర్వహిస్తున్నాం. తప్పకుండా తరలిరండి..' అని ముఖ్యమంత్రి సందేశంతో ఆహ్వాన లేఖలు పంపించారు.
తెలంగాణ భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించడం, పెట్టుబడులకు గమ్యస్థానంగా రూపొందిన ఇక్కడి వాతావరణం, విధానాలు, స్పష్టమైన లక్ష్యాలతో రాష్ట్ర అభివృద్ధి సాధన అంశాలను ఈ వేదికగా చాటి చెప్పాలని ప్రభుత్వం సంకల్పించింది. రెండు రోజుల పాటు జరిగే సదస్సులో డిసెంబర్ 9న తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారు.

ఈనెల 13న ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం, గ్రెటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ లయనెల్ మెస్సీ హైదరాబాద్‌కు రానున్నారు. ఆయన పాల్గొనే వేడుకలోనే ప్రత్యేక ఫుట్‌బాల్ మ్యాచ్ నిర్వహిస్తారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సుకు ఇది ప్రత్యేక ఆకర్షణగా, ముగింపు ఘట్టంగా నిలువనుంది.

ముఖ్యమంత్రిని కలిసిన నటుడు శుభలేఖ సుధాకర్

హైదరాబాద్,ప్రజాస్వరం : ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని సినీ నటుడు శుభలేఖ సుధాకర్ మర్యాద పూర్వకంగా కలిశారు. డిసెంబర్ 15 న రవీంద్రభారతి ఆవరణలో ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణకు ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. రవీంద్రభారతి ఆవరణలో విగ్రహ ఏర్పాటు కోసం అనుమతించినందుకు ఈ సందర్భంగా శుభలేఖ సుధాకర్ .. దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కుటుంబం తరఫున ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ఉన్నారు.

వరంగల్‌లో కిషన్‌రెడ్డి పర్యటన

వరంగల్, ప్రజాస్వరం : వరంగల్‌లో రైల్వే మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్ కల సాకారం కాబోతుందన్నారు. 160 ఎకరాల్లో ఆర్ ఎంయూ నిర్మాణం జరుగుతుందన్నారు. . 75 శాతం పనులు పూర్తయ్యాయని అన్నారు. . రూ.521 కోట్లతో నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఆధునిక పరికరాలు అందుబాటులోకి రాబోతున్నాయని వివరించారు. ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుందని చెప్పారు. 16 కోచ్‌లతో కూడిన రాక్స్ ఉత్పత్తి జరగబోతుందని వెల్లడించారు. ఉద్యోగాల విషయంలో స్థానికులకే అధిక ప్రాధాన్యత ఉంటుందని కిషన్‌రెడ్డి తెలిపారు.

లక్ష మెగావాట్ల విద్యుత్

2047 నాటికి అవసరం

రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ ఎకానమీయే లక్ష్యం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, ప్రజాస్వరం : " 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోందని, విద్యుత్ రంగంలో పెట్టుబడులు పెరగాలని, 2047 నాటికి లక్ష మెగావాట్ల విద్యుత్ అవసరం ఉంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో విద్యుత్ పరిస్థితి, భవిష్యత్ అవసరాలపై ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు తీర్చేందుకు ప్రణాళికలు తయారు చేసినట్లు అన్నారు. విద్యుత్ డిమాండ్ సన్నద్ధతపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. విద్యుత్ స్టోరేజ్‌పై ఇప్పటి వరకు ఎలాంటి ప్రణాళికలు చేయలేదన్నారు. విద్యుత్‌ను బ్యాటరీ స్టోరేజ్, పంప్‌డ్ స్టోరేజ్‌ల్లో అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. రాష్ట్రంలో 12 ప్రాంతాల్లో పంప్‌డ్ స్టోరేజ్ పాయింట్లకు అవకాశం ఉంది అని భట్టి అన్నారు.

62 ఏళ్ల వయసులో వివాహ బంధంలోకి ఆస్ట్రేలియా ప్రధాని

కాన్ బెర్రా, ప్రజాస్వరం : ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ 62 ఏళ్ల వయసులో వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. తన చిరకాల స్నేహితురాలు జోడీ హైడెన్ ను ఆయన శనివారం వివాహం చేసుకున్నారు.